క్లుప్తంగా

ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం



విద్యార్థి హిమశంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: 12వ మినీ ఒలింపియాడ్‌లో కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ రెండో సంవత్సర విద్యార్థి ఎం.హిమశంకర్ బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో హిమశంకర్‌ను సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ జేఎస్‌బీ పద్మనాభం, పీడీ బొంతు మధుకుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జి.భాస్కరరావు, అధ్యాపకులు నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు పల్లవి ఎంపిక



సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని చింతలపూడి పల్లవి గత ఫిబ్రవరి నెలలో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభాన్వేషణ పరీక్షల్లో అర్హత సాధించినట్టు హెచ్‌ఎం మద్దాలి వెంకటేశ్వరరావు శనివారం చెప్పారు. ఐదేళ్ల పాటు కేంద్రం అందించే ఉపకార వేతనంకు పల్లవి ఎంపికయిందన్నారు. దీని ద్వారా ఏటా రూ.12 వేల చొప్పున ఐదు సంవత్సరాల పాటు విద్యార్థిని ఖాతాకు నిధులు మంజూరవుతాయన్నారు. కాగా జాతీయ ప్రతిభా పురస్కారంకు ఎంపికైన పల్లవిని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముప్పర్తి శ్రీనివాసరావు, బోధనా సిబ్బంది అభినందించారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణ తరగతులు

రాజోలు: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రాజోలు మాతాజీ నిర్మలాదేవి సహజయోగ దివ్యమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. సహజయోగా ట్రస్ట్ చైర్మన్ బీవీవీ భద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ ఇచ్చిన సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ కార్యదర్శి ఎంవీఎస్ ప్రసాద్, జి.లక్ష్మణరావు, జి.కిషోర్, బి.అచ్యుతరామయ్య, బీవీ పద్మావతి, వైవీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరమణికి అభినందనలు

మామిడికుదురు: ఆల్ ఇండియా ర్యాంక్ సివిల్స్‌లో 583 ర్యాంకు కైవసం చేసుకున్న ఈదరాడ గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఉమాశ్రీ లక్ష్మీరమణి రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శనివారం ఆమె స్వగృహంలో అభినందించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధిస్తూ గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఉమా శ్రీలక్ష్మీరమణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రుద్రరాజు గోపాలకృష్ణరాజు, కూనపరెడ్డి వెంకట కృష్ణారావు, చిలకపాటి శ్రీధర్, అల్లూరి మధు రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి



చిరతపూడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులకు సాగు చేసుకునే విధంగా పనులు చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. చిరతపూడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజులు శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు సాగు నీరు వచ్చే పంట బోదెల్లో పూడికతీత, చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయాలన్నారు. అలాగే కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాల పనులు చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని అందుకు రక్షణ తీసుకుంటూ పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇసుకపూడికి చెందిన పళ్ల శ్రీనివాస్ (47) గత నెల 18న ట్రాక్టర్‌పై గడ్డి లోడు చేసి, పగ్గం బిగిస్తున్నాడు. ఆ క్రమంలో జారి పడిపోవడంతో బలమైన గాయమైంది. అతడిని తొలుత అమలాపురం ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాస్ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ బీవీ వరప్రసాద్ తెలిపారు.

నాలుగేళ్లలో నవ్యపథం

- రైతన్నకు చేదోడుగా జగనన్న ప్రభుత్వం
- విత్తు నుంచి పంట విక్రయం వరకూ ఆర్‌బీకేల ద్వారా దన్ను
- సంక్షేమంపై రైతన్నల హర్షం

కొత్తపేట: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ 'దేశానికి వెన్నెముక రైతు.. రైతు అభివృద్ధే దేశాభివృద్ధి..' అన్న నానుడి నేతల నోట ప్రకటనలకే పరిమితం తప్ప ఆచరణలో అమలుకు నోచుకున్న దాఖలాలు శూన్యం. నాడు ప్రజాప్రస్థానం పాదయాత్ర ద్వారా వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలను స్వయంగా చూశారు. ఆనాడు రాజశేఖరరెడ్డి వివిధ రైతు సంక్షేమ పథకాలు అమలు చేయగా తండ్రిని మించిన తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి ఆదర్శ పాలనతో మరెన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. దండగమారి వ్యవసాయం అన్న గత టీడీపీ పాలకుల నోళ్లు మూయించేలా వినూత్నమైన రైతు సంక్షేమ పథకాలు అమలు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు.

రైతు సంక్షేమ పథకాలు

విత్తనం నుంచి పంట విక్రయం వరకూ రైతులకు అండగా నిలిచి లాభాలతో గట్టెక్కించేందుకు రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి వాటి ద్వారా పంటల పెట్టుబడికి 'వైఎస్సార్ రైతు భరోసా', కేంద్ర ప్రభుత్వం వదిలేసిన రైతులు పండించిన పంటకు బీమా నిమిత్తం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా', రైతులు తీసుకున్న రుణాలపై 'వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ', తుపాన్లు, భారీ



రావులపాలెంలో రైతు భరోసా పంపిణీ కార్యక్రమంలో రైతులను సత్కరిస్తున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, కలెక్టర్ శుక్లా

వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన పంటలకు ఏ సీజన్‌లో నష్టానికి ఆ సీజన్‌లోనే 'నష్ట పరిహారం', 'ఇన్‌పుట్ సబ్సిడీ', 'వైఎస్సార్ యంత్ర సేవ' పథకం కింద ట్రాక్టర్లు, కోత మెషీన్లు వంటి యంత్ర పరికరాలు, 9 గంటలు విద్యుత్ సరఫరా, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ వంటి పథకాలతో పాటు విత్తనాలు, ఎరువులు సరఫరా, పండించిన పంటలు నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు.

సుమారు 3 లక్షల మందికి ప్రయోజనం

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 3 లక్షల మంది రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.650 కోట్ల ప్రయోజనం కల్పించింది.

కొత్తపేట మండలంలో వ్యవసాయ భూములు సుమారు 7,800 ఎకరాలు

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం సుమారు 9,400 ఎకరాలు

నాలుగేళ్లలో కొత్తపేట మండలంలో లబ్ధి ఇలా..

పథకం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	7676	10.37
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	2818	1.05
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	4451	1.63
యంత్రసేవ పథకం 21 గ్రూపులు	200	0.63
కౌలు రైతులకు కార్డులు	3050	--
మొత్తం	18,195	13.68

జగనన్న ఉన్నాడనే భరోసా..



మా కుటుంబానికి మొత్తం సుమారు 20 ఎకరాలు మెరక పొలం ఉంది. వివిధ మెట్ట పంటలు సాగు చేస్తుంటాం. రైతు భరోసా కింద 80 వేలు పడింది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద సుమారు లక్ష లబ్ధి చేకూరింది. గతేడాది గోదావరి వరదలకు లంక భూముల్లో పంటలకు నష్టం వాటిల్లితే అధికారులతో ఎన్యుమరేషన్ చేయించి నష్ట పరిహారం అందజేశారు. ఈ విధంగా రైతాంగానికి ప్రకృతి కరుణించకపోయినా జగనన్న ఉన్నాడనే భరోసా ఉంది.

– బందారు దొరబాబు, రైతు, వానపల్లి

ప్రభుత్వం అండగా నిలుస్తోంది



నాకు ఒక ఎకరం పొలం ఉండగా 11 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా జగనన్న ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలు అమలు చేస్తుంది. విత్తనాలు, ఎరువుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు వరకూ మా రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుంది. నాకు క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.26,750 వైఎస్సార్ రైతు భరోసా రూ.54,000 పడింది.

– కొండేటి వరదరాజు, రైతు, అవిడి

సకాలంలో డబ్బులు పడ్డాయి



నేను 6 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. 1121 సన్నాలు రకం సాగు చేశాను. గత నెలలో అకాల వర్షాలకు కొంత మేర తడిసినా గాని ఆర్‌బీకే కొనుగోలు సిబ్బంది ఏ విధమైన కొర్రి వేయకుండా, ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేశారు. సకాలంలో డబ్బులు పడ్డాయి. ప్రకృతి సహకరించకపోయినా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది. ఇంతకంటే మా రైతులకు ఏం కావాలి.

– డి.సూర్యనారాయణరాజు, కౌలు రైతు, అవిడి

పేదల సంక్షేమమే ధ్యేయం



పాశర్లపూడిలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసున్నారు. ఆయా కుటుంబాల్లో ఎవరెవరికి ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేశామన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి కుల, మత, పార్టీ భేదలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. సీఎం జగన్ పాలన ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు యూవీవీ సత్యనారాయణ, చిక్కం బుజ్జిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, మోకా విజయరాజు, తేతలి మోహనరెడ్డి, పాలమూరి గోపాల్, మొల్లేటి త్రిమూర్తులు, యనమండ్ర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లని మజ్జిగతో ఉపశమనం



పాశర్లపూడిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు ప్రసన్నకుమార్, జెడ్పీటీసీ అంజిబాబు

మామిడికుదురు: అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్న సమయంలో వారి దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ ఉపశమనం కలిగిస్తుందని జెడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు అన్నారు. సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు మాజీ జెడ్పీ ప్రతిపక్ష నాయకులు సాకా ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని పాశర్లపూడి కొండాలమ్మ చింత వద్ద శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఆళ్లగడ్డ సాయిరాం, తోరం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తాటిపాకలో..

రాజోలు: మొబైల్ మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తూ బాటసారుల దాహార్తిని తీర్చుతున్న సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ ఏఎంసీ చైర్మన్ జక్కంపూడి తాతాజీ అన్నారు. శనివారం జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సాకా ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న ప్రసన్నకుమార్‌ను పలువురు అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డగళ్ల సాయిరామ్, తోరం భాస్కరరావు, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, సూరిశెట్టి బాబ్జి, పిల్లి శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక బస్టాండ్ వద్ద శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రముఖ దాత దంతులూరి శ్రీనివాసరాజు సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో మజ్జిగ పంపిణీని శ్రీనివాసరాజు, రెడ్ క్రాస్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ప్రారంభించారు. ఎండలు తగ్గే వరకూ కూడా చలివేంద్రం నిర్వహిస్తామన్నారు. బోణం రాజు, నడింపల్లి వెంకట సుబ్బరాజు, తాడి సహదేవ్, అటారం మాస్టారు పాల్గొన్నారు.

సైకిల్‌తో కాలుష్య రహిత సమాజం

కొత్తపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యవంతులు కావాలని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పి.నిర్మలకుమారి సూచించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శనివారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకిల్ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్యరహిత సమాజానికి దోహదపడాలన్నారు. యోగా, మెడిటేషన్, సైకిల్ వ్యాయామం ద్వారా మనిషి ఆయుష్షు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం కార్యదర్శి సత్తిరాజు ఆదిత్యకిరణ్, ఎస్టీయూ కార్యదర్శి వి.బాలకృష్ణ, యూత్ కోఆర్డినేటర్ ఎం.బాలు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల సంతోషమే సీఎం లక్ష్యం



తాడిపూడిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని తాడిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పసుపు రంగు పూసి చంద్రబాబు కాపీ కొట్టారన్నారు. జగనన్న గోరుముద్ద, విద్యాకానుక తదితర పథకాల ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ప్రజలకు మంచి చేయలనే సంకల్పంతోనే ప్రయాణం చేస్తున్నామని, సాధ్యమైనంత మంచి చేసి చూపిస్తామన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ డీవీఎస్ అనిల్ కుమార్, సర్పంచ్ ముదునూరి సుబ్బలక్ష్మి, గణపతిరాజు, మాజీ సర్పంచ్ కేతా ఏడుకొండలు, కొల్లి శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు పోలీసుల మనోధైర్యం

కొత్తపేట: కట్టుకున్న భర్త చెప్పాపెట్టకుండా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఫోన్ స్విచాఫ్ చేయడంతో దిక్కుతోచని ఓ గర్భిణి దిశ పోలీసులకు ఫోన్ చేసింది. మండలంలోని గంటికి చెందిన తేజ, జ్యోత్స్న ప్రేమ వివాహం చేసుకున్నారు. వారం రోజులుగా ఆ భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా భర్త తేజ ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ చేయడంతో జ్యోత్స్న తీవ్ర మనోవేదనకు గురైంది. దిక్కుతోచని పరిస్థితుల్లో ఆమె దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి తన బాధను వివరించి సాయం కోరింది. స్పందించిన ఏఎస్సై కృష్ణారావు, పోలీసులు ఆమె భర్త ఎక్కడ ఉన్నాడో ఆచూకీ తెలుసుకుని ఆమెతో మాట్లాడించారు. అప్పుడు ఆమె మనసు కుదుటపడటంతో అతడు వచ్చే వరకూ గ్రామ మహిళా పోలీసు అందుబాటులో ఉంటుందని, ధైర్యంగా ఉండాలని జ్యోత్స్నకు దిశ టీమ్ సభ్యులు సూచించారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న సహాయకులు (హెల్పర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు సీడీపీఓ పి.శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట చిన్నగుళ్లపాలెం (బీసీ–బీ), కొత్తపేట రామాలయం వీధి, రావులపాలెం మండలం ఈతకోట గౌడ రామాలయం (బీసీ–డీ), ఆత్రేయపురం మండలం రాజవరం అడ్డగట్టు (ఓసీ) అభ్యర్థుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిశు అభివృద్ధి అధికారిణి, ఐసీడీఎస్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం కాంపౌండ్, కొత్తపేటలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగుల రిలే దీక్ష

రాజోలు: పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాజోలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యాన శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బారాయుడు ప్రారంభించారు. రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల ఉద్యోగ సంఘ నాయకులు దీక్షలో కూర్చున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చట్టం తీసుకురావాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, పెన్షనర్లకు బకాయి పడిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా వీఆర్వో సంఘం నాయకుడు మద్దాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం వద్దు–జీవితమే ముద్దు

అంబాజీపేట: ధూమపానం వద్దు–జీవితమే ముద్దు అని నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ ప్రమీల అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాల కార్యాచరణలో భాగంగా మాచవరం సచివాలయ–2 లో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన పొగాకుపై సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమీల మాట్లాడుతూ పొగాకు వాడకం వలన వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు

కొత్తపేట: రైస్ కార్డులేని అర్హులు గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీఓ ఎం.ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనం పొందడం కోసం సంక్షేమ క్యాలెండర్‌లోని సంవత్సరానికి రెండుసార్లు అనగా జూన్, డిసెంబర్ నెలల్లో కొత్త రైస్ కార్డులు అందచేయవలసి ఉందన్నారు. ప్రస్తుతం ఈ నెలలో అర్హులైన లబ్ధిదారులకు రైస్ కార్డులు అందచేయుటకు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి అర్హులైన వారు, ముఖ్యంగా ఒంటరి వ్యక్తులు, ఆశ్రయం లేనివారు, సంచార కుటుంబాల లబ్ధిదారులు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సప్తనదీ జలాలతో గ్రామోత్సవం



అంతర్వేది పుణ్యక్షేత్రంలో సప్తనదీ జలాలతో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని దేవస్థానంలో ఆదివారం స్వామివారి మూలవిరాట్‌కు నిర్వహించనున్న మహాజ్యేష్ఠాభిషేకానికి ఇప్పటికే సిద్ధం చేసిన సప్తనదీ జలాలతో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన అర్చకులు సప్తనదీ జలాలను వేదమంత్రాలతో పల్లకీలో ఉంచారు. మంగళ వాయిద్యాలతో పుణ్యక్షేత్రంలోని ప్రధాన వీధుల్లో పై గ్రామోత్సవం సాగింది. అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు పూర్వవిద్యార్థుల సమావేశం

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ కళాశాల పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ వేగేశ్న చారిటబుల్ ట్రస్టు అధినేత వేగేశ్న రామకృష్ణంరాజు, వేగేశ్న తమ్మిరాజు తెలిపారు. కార్యక్రమంలో గాదిరాజు ప్రసాదరాజు, ముదునూరి సోమరాజు, నంబూరి రవిరాజు, ఎస్‌వీ రామరాజు, సీహెచ్‌వీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టు భర్తీకి చర్యలు

పి.గన్నవరం: మండలంలో ఖాళీగా ఉన్న నరేంద్రపురం–కుందాలపల్లి అంగన్‌వాడీ కేంద్రం (ఓసీ–జనరల్)లో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టును భర్తీ చేస్తున్నామని సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 14 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



పెదపట్నంలంకలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంతో వలంటీర్ల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మొగలికుదురు, పెదపట్నం గ్రామాల్లోని వలంటీర్ల వందనం కార్యక్రమాన్ని సర్పంచ్‌లు గుబ్బల దుర్గ, కడి అరుణకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో వలంటీర్లే కీలకంగా పనిచేస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉండి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ప్రతిగా ఎమ్మెల్యే చిట్టిబాబును సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కడలి పద్మావతి, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పిచ్చుక చిన్న, తాడి శేఖర్, కొమ్ముల చిన్న, యనమదల సత్యనారాయణ, కొప్పిశెట్టి హేమసుందర్, కొల్లాబత్తుల మధువాసన్, సిరా వెంకటేశ్వరరావు, పాలమూరు రంగా తదితరులు పాల్గొన్నారు.

వీవీ మెరకలో..

సఖినేటిపల్లి: సంక్షేమ పథకాల అమలులో గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. శనివారం వీవీ మెరకలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు పొందిన వలంటీర్లను ఎంపీపీ మల్లిబాబు, సర్పంచ్ రత్నకుమారి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ గుబ్బల అంజిబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఓగూరి బాబులు, మేడిది రెడ్డి, తాడి సహదేవ్, ప్రముఖులు ముత్యాల యుగంధర్, జె.రాజబాబు, భవానీ, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం చేయండి

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.వెంకటరామారావు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల ఏఏ, వీహెచ్‌ఏలకు ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై శనివారం మధ్యాహ్నం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పంట కాలువలకు సాగునీరు విడుదల చేసినందున త్వరగా రైతులు నారుమడులు వేసుకుని, వచ్చే నెల చివరి నాటికి నాట్లు వేయడం పూర్తి చేయాలని సూచించారు. ఖరీఫ్ పంట కాలానికి అనువైన ఎంటీయూ–7029, ఎంటీయూ–1318, ఎంటీయూ–1061 వంటి రకాలు సాగు చేసుకునే విధంగా, విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ఆర్‌బీకేలో యూరియా 20 టన్నులు, డీఏపీ 10 టన్నుల చొప్పున పెట్టాలని, ఇప్పటి వరకూ 11 ఆర్‌బీకేల్లో ముందస్తుగా యూరియా 20 టన్నులు, డీఏపీ 10 టన్నులు దిగుమతి చేసినట్టు తెలిపారు. కిసాన్ డ్రోన్‌పై లాం ఫామ్ గుంటూరులో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న యువరైతులు సంబంధిత గ్రామ ఆర్‌బీకేలో దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థి లేదా తల్లి, తండ్రికి సొంత భూమి ఉండి ఇంటర్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆర్‌బీకే కార్యకలాపాలకు సంబంధించి అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు.